క్లుప్తంగా

రోల్ మోడల్‌గా యువత నిలవాలి



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భవిష్యత్తు తరానికి ప్రస్తుత యువత రోల్‌మోడల్‌గా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఏయూ టీఎల్‌ఎన్ సభా మందిరంలో నిర్వహించిన ఐఏఎస్ఈ ఫ్రెషర్స్‌డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా మీరంతా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు వీసీ బహుమతులు అందజేశారు.

187 మందికి వైద్య పరీక్షలు



మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆరిలోవ: మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, సేవా స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతం సెయింట్ ఆన్స్ నవజీవన హెల్త్ సెంటర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న మహిళలకు సేవలు అందించారు. మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయం సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఆరిలోవ కాలనీ, రాజీవ్‌నగర్, దుర్గాబజార్, టీబీసీ పాయింట్, లీలాసుందరినగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 187 మంది మహిళలకు పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, సెయింట్ ఆన్స్ నవజీవన హెల్త్ సెంటర్ ప్రతినిధి ఏంజెల్ మేరీ, ఆస్పత్రి గైనకాలజిస్టులు డాక్టర్ సుభద్ర, డాక్టర్ బాంటిన పాల్గొన్నారు.

అనధికారిక విద్యుత్ కోతలతో అవస్థలు

ఆరిలోవ: అనధికారిక విద్యుత్ కోతలతో ఆరిలోవ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రకటనలు చేయకుండానే గంటల తరబడి సరఫరా నిలిపేస్తున్నారు. దీంతో స్థానికులు ఉక్కపోతతో నానా అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ 12వ వార్డు పరిధి లీలాసుందరినగర్, నెహ్రూనగర్, రాజీవ్‌నగర్, దుర్గానగర్ కాలనీల్లో రెండు రోజులుగా రాత్రి వేళ గంటల తరబడి విద్యుత్ నిలిపేశారు. శని, ఆదివారాలలో రాత్రి 10.30 నుంచి 11.45 గంటల వరకు విద్యుత్ లేదు. మళ్లీ అర్ధరాత్రి దాటి ఒంటి గంట నుంచి వేకువ జామున 4 గంటల వరకు పలుమార్లు గంట, అరగంట చొప్పున విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో ఆయా కాలనీలలో స్థానికులు ఉక్కపోతతో నిద్ర పట్టక అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా.. వినియోగం లోడు పెరిగిపోవడంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.


చూడముచ్చటగా సీతకొండ

- గతంతో పోల్చుకుని సందర్శకులు హర్షం
- సుందరీకరణతో ఆకట్టుకుంటున్న పర్యాటక ప్రాంతం



(నాడు)

సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద కొండ వాలులో ఉన్న మట్టి, బండలు



(నేడు)

సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద కొండ వాలులో రాళ్లపై వేసిన పెయింటింగ్స్

ఆరిలోవ: శిథిలమైన కొండవాలు.. అస్తవ్యస్తంగా మట్టి, బండరాళ్లతో దర్శనమిచ్చే సీతకొండ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. చూడముచ్చటైన పెయింటింగ్స్‌తో కనువిందు చేస్తోంది. ఈ సీ వ్యూ పాయింట్ శిథిలావస్థకు చేరింది. ఇక్కడ ఫుట్‌పాత్‌లు, సముద్రం వైపు వ్యూ పాయింట్, కొండవాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఈ క్రమంలో జీ–20 సదస్సులో భాగంగా బీచ్ రోడ్డులో ఉన్న సీతకొండ సీ వ్యూ పాయింట్‌ను సుందరంగా తీర్చిదిద్ది వైఎస్సార్ సీ వ్యూ పాయింట్‌గా నామకరణం చేయడం తెలిసిందే. కొండవాలులో గతంలో ఎప్పుడు జారిపడతాయోనని భయభ్రాంతులను చేసిన బండ రాళ్లను సరిచేసి వాటికి పెయింటింగ్ వేశారు. పలకలు ఊడిపోయి పిచ్చి మొక్కలతో



(నాడు)

శిథిలమైన ఫుట్‌పాత్



(నేడు)

అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్



(నాడు)

బీచ్ వైపు శిథిలమైన వ్యూ పాయింట్



(నేడు)

ఇటీవల అభివృద్ధి చేసిన పాయింట్

అస్తవ్యస్తంగా మారిన ఫుట్‌పాత్‌లను ఆధునికీకరించి తీర్చిదిద్దారు. వాటికి రక్షణ గోడ నిర్మించి మిలమిల మెరిసే పలకలు అమర్చారు. సీ వ్యూ పాయింట్‌లో విద్యుత్ బల్బులు, సోలార్ లైట్లతో కూడిన ట్రీ ఏర్పాటు చేశారు. దీంతో ఈ సీ వ్యూ పాయింట్ అందంగా మారింది. సందర్శకులను ఆకట్టుకుంటోంది. అప్పటికి, ఇప్పటికి ఎంత తేడా అంటూ సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి

- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సూచన
- 13వ వార్డులో విస్తృత పర్యటన



లక్ష్మీనగర్‌లో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: వార్డుల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ శానిటరీ విభాగం అధికారులకు సూచించారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి లక్ష్మీనగర్, ఎర్నిదుర్గానగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో గెడ్డలు, కాలువలు, రోడ్లు పరిశీలించారు. ఎర్నిదుర్గానగర్, లక్ష్మీనగర్ మధ్య కాలువ గోడలు శిథిలావస్థకు చేరడం, ఆ గెడ్డలో స్థానికులు పాలిథిన్ కవర్లతో మూటలు కట్టి పడేసిన చెత్త పేరుకుపోవడాన్ని ఆయన గమనించారు. దీనిలో చెత్త వెంటనే తొలగించి శుభ్రం చేయించాలని స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న గెడ్డ గోడల నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. దీనిలో స్థానికులు చెత్త వేయకుండా అవగాహన కల్పించి, నియంత్రించాలని చెప్పారు. అనంతరం స్థానికులతో ఆయన మాట్లాడి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేసి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని సూచించారు. అనంతరం ముడసర్లోవ వద్ద డంపింగ్‌యార్డును సందర్శించారు. ఇక్కడ రోజుకు ఎన్ని టన్నులు చెత్త వస్తుంది, ఈ చెత్త ఎక్కడికి తరలిస్తున్నారు, ఇళ్ల నుంచి చెత్తను సేకరించడానికి ఎన్ని వాహనాలు ఉన్నాయి.. తదితర అంశాల గురించి సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ కెల్ల సునీత, అడిషనల్ కమిషనర్ వి.సన్యాసిరావు, జెడ్సీ కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం నేడు



వివరాలు వెల్లడిస్తున్న మయాంక్ కుమారిదేవి

బీచ్ రోడ్డు: ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలోని వారసత్వ నిర్మాణాలను వాటర్ పెయింటింగ్ ద్వారా గీసిన చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభం కానుందని హవా మహల్ రాజామాత మయంక్ కుమారి దేవి అన్నారు. సోమవారం హవామహల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్టిస్ట్ నరేష్ మహంతి గీసిన చిత్రాలను షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో ప్రదర్శించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ ఎగ్జిబిషన్‌ను హవామహల్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ప్రారంభిస్తారన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఓ తొమ్మిదేళ్ల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక 40 గజాల కాలనీకి చెందిన బాలికను గుర్తు తెలియని యువకుడు ఈ నెల 9న మాయ మాటలు చెప్పి బైక్‌పై ముడసర్లోవ సమీప నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును దిశ పోలీసులకు అప్పగించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న యువకుడు ఎట్టకేలకు సోమవారం పోలీసులకు చిక్కాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్.వివేకానంద్, ఆరిలోవ సీఐ సోమశేఖర్, సిబ్బందితో కలసి సంఘటన జరిగిన ముడసర్లోవ ప్రాంతాన్ని పరిశీలించారు. నిందితుడి నుంచి పూర్తి వివరాలు సేకరించడం కోసం ఈ వ్యవహారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. నిందితుడిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలిసింది.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



వృద్ధుడికి ప్రభుత్వ పథకాల కోసం వివరిస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగన్'కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సీఎం వైఎస్ జగన్ ఉన్న స్టిక్కర్‌ను గృహాలకు అతికించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సహకార వ్యవసాయ ప్రాధికార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు సోమవారం ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ పీఏసీఎస్‌ల్లో 50 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునకు 8 డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.ఎ.ఆర్.ఆంజనేయులు, కోశాధికారి డి.మృత్యుంజయ రావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉప గవర్నర్‌గా సూర్యప్రకాష్



బీచ్‌రోడ్డు: రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్ జిల్లా ఉప గవర్నర్–2గా దిగపల్లి సూర్యప్రకాష్ సోమవారం నియమితులయ్యారు. క్లబ్ ద్వారా సూర్యప్రకాష్ అందించిన సేవలను గుర్తించి జిల్లా కమిటీ ఆయనను ఎంపిక చేసింది. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా 55 క్లబ్‌లు ఉన్నాయనిచ వాటి ద్వారా మరిన్ని సేవలు అందిస్తామని సూర్యప్రకాష్ ఈ సందర్భంగా తెలిపారు. తనను ఉప గవర్నర్‌గా ఎంపిక చేసిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుమారుడితో మహిళ అదృశ్యం



అదృశ్యమైన ఇందు

బీచ్ రోడ్డు: కుమారుడితో పాటు ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ వెనక వైపు నివాసం ఉంటున్న నందిని ఇంటికి ఆమె చెల్లి ఇందు ఈ నెల 9న తన కుమారుడితో వచ్చి ఉంటోంది. అయితే ఈ నెల 13న నందిని.. ఇందు భర్త సంతోష్‌కు ఫోన్ చేసి పిల్లవాడుతో పాటు ఇందు ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని చెప్పింది. దీంతో సంతోష్ కుటుంబ సభ్యులు, స్నేహితులను వాకబు చేయగా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు సోమవారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌కు జ్వర నియంత్రణ పరికరం అందజేత



పరికరంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ తదితరులు

మహారాణిపేట: పిల్లల్లో జ్వరాన్ని నియంత్రించే ఎల్ఈడీ ఫొటోథెరపీ పరికరాన్ని జియో టెక్ హెల్త్ కేర్ సంస్థ కేజీహెచ్‌కు విరాళంగా ఇచ్చింది. 25 వేల రూపాయల విలువ చేసే ఈ పరికరాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, బయో మెడికల్ ఇంజినీరు పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై ద్వంద్వ వైఖరి తగదు



నరసింహనగర్ కూడలిలో ధర్నా చేస్తున్న వామనమూర్తి, ఇతర నాయకులు

సీతంపేట: కేంద్ర ఉక్కు సహాయక మంత్రి ఫగాన్ సింగ్ కులస్తే ద్వంద్వ వైఖరి విడనాడాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసింహనగర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలిపివేస్తామని, ప్లాంట్. అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ప్రకటించిన కేంద్ర మంత్రి.. సాయంత్రమయ్యే సరికి మాట మార్చేశారని మండిపడ్డారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అని రెండేళ్లుగా చేస్తున్న నిరసనలు, ధర్నాలను విచ్ఛిన్నం చేయడానికే ఫగాన్ సింగ్ అటువంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ఐరన్‌ఓర్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, కేలం శివ, కె.శ్రీను, పి.సాయికుమార్, జి.సూర్యారావు, డి.మహాలక్ష్మినాయుడు, బి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీశ్రీపై క్విజ్ పోటీ

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఈ నెల 25వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై క్విజ్ పోటీ నిర్వహించనున్నట్టు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష ఉంటుందని, వన్ వర్డ్ ఆన్సర్స్ రూపంలో రాయాల్సి ఉంటుందన్నారు. 30 ఏళ్లలోపు వారు(జూనియర్స్) ఒక విభాగం గాను, ఆపై వయస్సు ఉన్నవారు (సీనియర్స్) మరో విభాగం గాను పోటీ జరుగుతుందని చెప్పారు. రెండు విభాగాలకు విడివిడిగా ప్రథమ బహుమతి రూ.1,000, ద్వితీయ బహుమతి రూ.750 ప్రదానం చేస్తామన్నారు. ఈ నెల 30న ఆంకోశాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు వారి పేర్లను వాట్సాప్ ద్వారా ఈ నెల 20లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు 98851 88431, మేడా మస్తాన్‌రెడ్డి 94413 44365 నంబర్లకు వాట్సాప్ చేయాలని కోరారు.

సెయింట్ ఆంథోనీ హైస్కూల్ కొనసాగింపునకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ కార్యదర్శి నితిన్

దాబాగార్డెన్స్: ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పి, ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కార్యదర్శి ఉమ్మిడి నితిన్ కలెక్టర్ మల్లికార్జునను కోరారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి, కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నితిన్ మాట్లాడుతూ చరిత్ర గల సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల ను యాజమాన్యం మూసివేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారన్నారు. ఇక్కడ చదువుతున్న పిల్లల తల్లిదండ్రులంతా పేదలని.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత లేనివారని తెలిపారు. పాఠశాల యథావిధిగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏబీవీపీ నాయకులు కిరణ్, ఎల్లాజీ తదితరులున్నారు.

'స్పందన'కు 20 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిందాల్ ఎనర్జీ ప్లాంట్ పరిశీలన

మధురవాడ: మధురవాడ జోన్‌లోని కాపులుప్పాడ డంపింగ్ యార్డుని జీవీఎంసీ కమిషనర్ సీఎమ్ సాయికాంత్ వర్మ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని సందర్శించి, కార్యకలాపాలు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్లాంట్‌కి ఎంత చెత్త అవసరం.. జీవీఎంసీ నుంచి ఎంత ఇస్తున్నారు.. ఎంత ఉపయోగిస్తున్నారు.. మిషనరీ పనిచేసే విధానం.. ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర అన్ని విషయాలు ఆరా తీశారు. జీవీఎంసీ నుంచి జిందాల్ ప్లాంట్‌కు 1200 టన్నుల చెత్త ఇస్తున్నామని, 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని, 13.7 మెగా వాట్లు ఏపీ ట్రాన్స్‌కో ఆనందపురం గ్రిడ్‌కి సరఫరా చేస్తున్నట్టు జీవీఎంసీ అధికారులు, జిందాల్ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోన్ – 2 కమిషనర్ కనక మహాలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

795వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 795వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడం తప్పదని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేయడం సరి కాదన్నారు. ఆ ప్రకటనలకు బెదిరేది లేదన్నారు. పోరాటం చేయడం ద్వారా ఉక్కు కార్మికుల పోరాట శక్తి దేశానికి తెలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

'అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ రద్దు చేయాలి'



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగారావు

దాబాగార్డెన్స్: మెడికల్ షాపులు, హాస్పిటల్స్, చిన్న చిన్న కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌పై జీవీఎంసీ భారీగా విధించిన అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ ఉపసంహరించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి.గంగారావు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా అత్యవసర సర్వీసులపై కూడా అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ విధించడం చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికే ఆ సంస్థలపై జీవీఎంసీ భారీగా ఆస్తిపన్ను విధించిందని, వాటర్ చార్జీలు పెంచడంతో పాటు ట్రేడ్‌లైసెన్స్ రెండు రెట్లు పెంచిందని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ విధించడంలో, వసూళ్లలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చాలా ఏజెన్సీ బోర్డులకు నిబంధనల ప్రకారం పన్ను కూడా విధించడం లేదని, జీవీఎంసీ కోట్లాది రూపాయలు కోల్పోతుందన్నారు. ఈ అక్రమాలపై ఎలాంటి ఆడిట్ జరపడం లేదన్నారు. వీటిని పరిశీలించాలని కోరారు.